# గ్రామీణ కళాశాలలకూ ఆధునిక కోర్సులు

- ఎస్‌ఏపీతో కలసి టాస్క్ ఏర్పాట్లు
- బీకాం విద్యార్థులకు పెరగనున్న ఉద్యోగావకాశాలు
- ఏడు కళాశాలలతో ఒప్పందం

ఈనాడు – హైదరాబాద్

సాధారణ విద్యతో పాటూ అదనపు కోర్సులు చేసేందుకు హైదరాబాద్‌లో ఉన్న సౌకర్యం తమకు లేదని గ్రామీణ విద్యార్థులు బాధపడనక్కర్లేదు. ఇంజినీరింగ్‌లో చేరని విద్యార్థులూ ఉపాధి గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. పట్టా చేతికందగానే విద్యార్థుల్ని ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగార్హుల్ని చేసే సిస్టమ్స్, అప్లికేషన్స్ అండ్ ప్రొడక్ట్స్ (ఎస్‌ఏపీ-సాప్) కోర్సుల్ని పల్లెలకూ తెస్తోంది తెలంగాణ నైపుణ్య విజ్ఞానాభివృద్ధి సంస్థ (టాస్క్). బీకాం విద్యార్థులకు వాణిజ్య, సాంకేతిక సాఫ్ట్‌వేర్ వినియోగంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఎస్‌ఏపీ పరిజ్ఞానాన్ని, నైపుణ్యాలను గ్రామీణ ప్రాంతాల్లోని కళాశాలల్లో బోధించే ఏర్పాట్లు చేసింది. మొత్తం 80 గంటల పాటు సాగే ఈ కోర్సును ఎస్‌ఏపీ నిపుణులు నేర్పుతారు. చాలామంది విద్యార్థులు డిగ్రీ అయ్యాక ప్రైవేటు సంస్థల్లో ఈ కోర్సులు నేర్వటానికి వెళుతుంటారు. డిగ్రీతోపాటే ఈ కోర్సులు పూర్తి చేసేలా, చదువుకు ఆటంకం లేకుండా సంప్రదాయ బీకాం డిగ్రీతో పాటే ఎస్‌ఏపీ అందించే సర్టిఫికెట్‌తో బయటకు వచ్చేలా టాస్క్ శిక్షణను రూపొందించింది. తద్వారా బీకాం పట్టాతోపాటు, ఎస్‌ఏపీ సర్టిఫికెట్ తీసుకొని బయటకు వచ్చే విద్యార్థులకు వెంటనే సంబంధిత రంగంలో ఉద్యోగాలు దొరకడానికి అవకాశాలు పెరుగుతాయి. ప్రైవేటు సంస్థల్లో నేర్చుకోవాలంటే లక్షకుపైగా ఖర్చయ్యే ఈ కోర్సులను సబ్సిడీతో వేలల్లో (నామమాత్రపు ధరకు) అందిస్తున్నారు. కేవలం విద్యార్థులకే కాకుండా ఆయా కళాశాలల్లోని బోధన సిబ్బందికి కూడా ఇందులో శిక్షణ ఇస్తారు. తొలి విడతలో భాగంగా రాష్ట్రంలోని ఏడు కళాశాలలు టాస్క్‌తో ఈ కోర్సులకు సంబంధించి ఒప్పందం కుదుర్చుకున్నాయి.




ఎస్‌ఏపీ కోర్సుల ఒప్పందం అనంతరం టాస్క్, కళాశాలల ప్రతినిధులు

మాస్టర్ జీ, గీతాంజలి, న్యూసైన్స్, భారత్, వాగ్దేవి (వరంగల్ జిల్లా); సెయింట్ మేరీ సెంచునరీ, హెచ్‌ఆర్డీ (హైదరాబాద్) కళాశాలల ప్రతినిధులు టాస్క్‌తో ఒప్పందంపై శుక్రవారం సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో టాస్క్ సీఈవో సుజీవ్ నాయర్, డైరెక్టర్ జి.భాస్కర్, ఎస్‌ఏపీ ఎడ్యుకేషన్ భారత ఉపఖండం అధిపతి మనోజ్ భాంతియా, ప్రతినిధులు భద్రి నారాయణ్, ఫిలిప్ శ్యామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

'పరిశ్రమల అవసరాలను గుర్తించి వారి సూచనల మేరకు రూపొందించిన కోర్సులివి. కేవలం ఇంజినీరింగ్‌కే కాకుండా అందులోనూ హైదరాబాద్‌కే కాకుండా ఇంజినీరింగేతర గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులను కూడా ఉద్యోగార్హులుగా మార్చాలన్న ఉద్దేశంతో ఎస్‌ఏపీతో కలసి దేశంలోనే తొలిసారిగా బీకాం విద్యార్థులకు ఈ మాడ్యూల్స్ రూపొందించాం. నాణ్యమైన నైపుణ్యాలను అందించాలన్నది మా ప్రయత్నం. ఆన్‌లైన్‌తో పాటు స్వయంగా శిక్షకులు కాలేజీలకు వెళ్లి కూడా నేర్పుతారు.'

– సుజీవ్ నాయర్, టాస్క్ సీఈవో